సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వారు అవసరమైన ధ్రువపత్రాలను జత చేయాలని సూచించారు. కేవలం ప్రభుత్వ అనుమతి పొందిన మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు సైతం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని అర్హులైన వారికి తప్పకుండా పథకాల ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, వజీఉజ్‌జమా, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం


బాక్సింగ్ విజేతలతో పాటు ఏసీపీ చంద్రశేఖర్, డాక్టర్ రాజ్ నారాయన్ ముదిరాజ్

చార్మినార్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్ అన్నారు. శివాజీ మహరాజ్ 394 జయంతిని పురస్కరించుకొని బ్రదర్స్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పూల్ బాగ్ చమన్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో బాక్సింగ్ చాంపియన్‌షిప్–2024 నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ.. యువకులు, విద్యావంతులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా రెగ్యులర్‌గా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.రాజ్‌నారయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు ప్రతిరోజూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ దుర్గా ప్రసాద్, బాలకృష్ణ, మధుసూదన్ రావు, రవి ముదిరాజ్, లెనిన్ బాబు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఏసీపీ బహుమతులతో పాటు ప్రసంశా పత్రాలను అందజేశారు.

గండి మైసమ్మకు పూజలు


పూజల్లో సమాజ్ రాష్ట్ర చైర్మన్ మహేష్కర్ కాంతిలాల్ చౌదరి

జియాగూడ: తెలంగాణలో మోచీ సమాజ్ కులస్తులకు తహసీల్దార్ ద్వారా నేరుగా కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని నూతనంగా తెలంగాణ రాష్ట్ర సంత్ రవిదాస్ మోచీ సమాజ్ సేవా సంఘం చైర్మన్ మహేష్కర్ కాంతిలాల్ చౌదరి అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర శ్రీ సంత్ రవిదాస్ మోచీ సమాజ్ సేవా సంఘం నూతన కార్యవర్గం ఏర్పడింది. ఈ సందర్భంగా గండిపేట్‌లోని మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్కర్ కాంతిలాల్ చౌదరి మాట్లాడుతూ..నగరంలో మోచీ కులస్తులకు ఉపాధి కరువైందని గతంలో లిడ్‌క్యాప్ సంస్థ ద్వారా ప్రధాన కూడళ్లలో ప్రభుత్వం డబ్బాలను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఆయన ప్రకటించారు. అధ్యక్షుడిగా పి.మనోహర్‌లాల్, ఉపాధ్యక్షుడిగా వినోద్ దయాల్, ప్రధాన కార్యదర్శిగా ఉమేష్‌కుమార్ మహేష్కర్, సహా కార్యదర్శిగా తుల్జేష్ దేవాన్ష్, సలహాదారులుగా మనోహర్‌లాల్ మాహోరే, డి.గణేష్, సీహెచ్ తుల్జేష్ తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.

స్టాఫ్ నర్సులకు పదోన్నతులు కల్పించాలి


వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

సుల్తాన్‌బజార్: వైద్య విధాన పరిషత్ పరిధిలో పని చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూపాల్ కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో కొంతకాలంగా పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 1998 నుంచి వివిధ బ్యాచ్‌లుగా నియామకం అయిన వారు ఉన్నారని 25 ఏళ్లకు పైగా సర్వీస్ పూర్తయిన వారికి కూడా ప్రమోషన్స్ లేకపోవడం శోచనీయమన్నారు. చిన్న చిన్న కోర్టు కేసుల పేరిట ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో నర్సులు సర్వీస్‌లో చాలా నష్టపోతున్నారన్నారు. కేసులన్నింటినీ విత్‌డ్రా చేసుకుంటేనే ప్రమోషన్లు ఇస్తామనడం ఎంతవరకు సబబు అన్నారు. స్టాండింగ్ కౌన్సిల్ అభిప్రాయం తీసుకుని ఫైనల్ జడ్జిమెంట్‌కు లోబడి ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియాద్దీన్, భూలక్ష్మీ, యాదనాయక్, బైరపాక శ్రీనివాస్, సరళ, శోభా, రోహిణి దేవి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోండి


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో జీహెచ్‌ఎంసీకి చెందిన దుకాణాల కేటాయింపులో అవకతవకలకు పాల్పడిన జీహెచ్‌ఎంసీ ఎస్టేట్ అధికారి భాషా, అసిస్టెంట్ అధికారి వినోద్‌పై చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ట్యాంక్‌బండ్ ప్రాంతంలోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులపై ఆధారాలతో కూడిన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ..గత నెలరోజుల క్రితమే తాను ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్నారు. కోఠి ప్రాంతంలో ఉన్న దుకాణాల కిరాయిలు రూ.60 వేల నుంచి రూ.70 వేలు ఉండగా వాటిని తక్కువ ధరలకే ఎస్టేట్ అధికారి భాషా, అసిస్టెంట్ అధికారి వినోద్ కట్టబెట్టారన్నారు. అవకతవకలకు పాల్పడిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోనిచో తాను ఏసీబీ, డీజీపీకి, ఏసీబీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. వారు కేటాయించిన దుకాణాల లైసెన్సులను రద్దు చేసి జీహెచ్‌ఎంసీ చట్టప్రకారం టెండర్ల ద్వారా దుకాణాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అహ్మద్, మహ్మద్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వ హయాంలోనే మహిళల అభ్యున్నతి


సంబరాల్లో కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ తదితరులు

అబిడ్స్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ హయాంలోనే మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ భీశ్వ సురేఖ పేర్కొన్నారు. అబిడ్స్ కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయంలో మహిళా దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని ప్రసంగించారు. పదేళ్లుగా జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో ప్రతి రంగంలో మహిళలు రాణించేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పలు విధాల సహకారాలు అందించిందన్నారు. మహిళలంతా ధైర్యవంతులుగా ఉంటూ అన్నిరంగాల్లో మరింత రాణించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి మహిళ ఈ పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా చేసేందుకు తమ శక్తి సామర్థ్యాలను ప్రయోగించి కొత్త బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

రెండవ విడత దళితబంధు నిధులు విడుదల చేయాలి

నాంపల్లి: దళిత బంధు పథకం రెండవ విడత లబ్ధిదారులకు న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర దళిత బంధు సాధన ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు కోగిల మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపికైన లబ్ధిదారుల అకౌంట్లో నిధులను జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దళిత బంధు నిధులను విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర దళిత బంధు సాధన ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో గన్‌పార్కు ఎదుట నిరసన చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన కోగిల మహేష్ మాట్లాడుతూ..దళిత బంధు పథకం ద్వారా రెండవ విడత లబ్ధిదారులను ఆయా జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.3 లక్షల చొప్పున జిల్లా కలెక్టర్ల అకౌంట్లలో నిధులు మంజూరు చేసిందన్నారు. మొదటి విడతగా రూ.3లక్షల నిధులను తక్షణమే లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేసే విధంగా ఉత్తర్వులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేయాలని కోరారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్య పాల్గొన్నారు.

పాతబస్తీలో వేడెక్కిన పార్లమెంట్ రాజకీయాలు

- మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ఆరు గ్యారంటీలే గెలిపిస్తాయి.. అందుకే పొత్తులు వద్దంటున్న నాయకులు
- కాంగ్రెస్‌తో మజ్లిస్ లోపాయికారి ఒప్పందం ఉంటుందా..?
- ఒంటరిగానే పోటీ చేయనుందా..?


గ్యారంటీలే గెలిపిస్తాయి...

చార్మినార్: పాతబస్తీలో మారుతున్న రాజకీయ పరిస్థితును సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన అధికారం చేజిక్కగానే ఏళ్ల తరబడి తమ పార్టీకి దూరంగా ఉన్న మజ్లిస్ పార్టీ తిరిగి రాజకీయ వ్యూహం మార్చి కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతున్న పరిణామాలను గమనిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉండడంతో తాము హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఒంటరిగానే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని..పొత్తులు లేకుండా ముందుకు వెళ్తే ఆశించిన ఫలితాలుంటాయని పాతబస్తీ కాంగ్రెస్ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఏళ్ల తరబడి బీఆర్‌ఎస్‌తో పొత్తుపెట్టుకున్న మజ్లిస్ పార్టీ ఉన్నట్టుండి కాంగ్రెస్ పార్టీతో దోస్తీకి సిద్ధమైన పరిణామాలను పాతబస్తీ కాంగ్రెస్ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అన్ని వర్గాల ప్రజల నుంచి తమ పార్టీకి ఆదరణ లభిస్తోందని.. ఇలాంటి సానుకూల పరిస్థితుల్లో ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగాలని కోరుతున్నారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీలు తమకు అనుకూలంగా మారాయని.. ముస్లిం ఓటర్లు సైతం తమ పార్టీకే మద్దతు తెలుపుతున్నారని..హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి డమ్మీ అభ్యర్థిని కాకుండా బలమైన అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దింపాలని పాతబస్తీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు. ఫలక్‌నుమాలో మెట్రో రైలు పనుల కోసం ఏర్పాటు చేసిన శంకుస్థాపన సందర్భంగా జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డితో సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యవహరించిన తీరు దోస్తానా వైపు చేయి చాచినట్లు స్పష్టమవుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు.

పార్టీ ఆదేశిస్తే హైదరాబాద్ నుంచి పోటీ : అలీ మస్కతి



రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తాను విజయం సాధించి చార్మినార్ కట్టడంపై తిరంగా జెండాను ఎగరవేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రచారం, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆరు గ్యారంటీలకు హైదారబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ఓటర్లు తమ పార్టీకే ఓటు వేసి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని.. ఈ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం తనకే టికెట్ కేటాయిస్తే.. విజయం సాధించి చూపిస్తానని ఆయన అంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు జాతీయ సమైక్యతను చాటి చెబుతున్నాయన్నారు. కుల, మతాలకు అతీతంగా తమ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తోందని..రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కే ఓటు వేసి గెలిపించనున్నారన్నారు.

ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న నాగ్‌నాథ్ మాశెట్టి దంపతులు

చార్మినార్: టీ.ఎస్.బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసిన వెంకటేశ్



గౌలిపురా: మహబూబ్‌నగర్ మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాంపల్లిలోని హజ్ భవన్‌కు వచ్చిన ఎమ్మెల్యేను వెంకటేశ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. 2020లో దుబ్బాకలో జరిగిన ఉప ఎన్నికల్లో ఒకే మండలంలో ఇన్‌చార్జీలుగా ఇరువురు కలిసి పని చేశారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



సంతోష్‌నగర్: ఎన్నికల సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తున్నామని చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్ కుమార్ అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఏసీపీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ..రానున్న పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు నాయకులు, ప్రజలు పోలీసులకు పూర్తిగా సహాయ సహకారాలు అందించాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

లంగర్‌హౌస్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం..అఫ్సర్ కాలనీలో నివాసముండే అబ్దుల్లా బిన్ అహ్మద్(48) గతంలో ఎలక్ట్రికల్ వస్తువుల దుకాణం నిర్వహించేవాడు. కరోనా సమయంలో వ్యాపారం మూసివేశాడు. అనంతరం తనకు వచ్చిన ఎలక్ట్రిక్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అతను సోమవారం తెల్లవారుజామున తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారాక నిద్రలేచిన అతని కుమారుడు చూడగా ఆయన అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


వేడుకల్లో జస్టిస్ రాధారాణి, డాక్టర్ ఉమర్ అలీషా తదితరులు

సుల్తాన్‌బజార్: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తేనే దేశం అభివృద్ధి పథకంలో పయనిస్తుందని హైకోర్టు జడ్జి జి.రాధారాణి పేర్కొన్నారు. ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, జీవనది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా జస్టిస్ రాధారాణి హాజరై పలు రంగాల్లోని మహిళలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలను లింగ వివక్షకు గురికాకుండా అన్నింటిలోనూ సమాన అవకాశాలు కల్పించాలన్నారు. రాజకీయ రంగంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి రాజేశ్వరీ, దాసరి ప్రసన్న, వేమూరి లక్ష్మీకాంత్, సీతా మహాలక్ష్మి, దుర్గ, కె.లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. లలితాబాగ్ ఆర్‌యూబీ నుంచి పటేల్‌నగర్ మెయిన్ రోడ్డు మీదుగా లక్ష్మీ నరసింహబార్, మేకలమండి చౌరస్తా వరకు సోమవారం ఆమె నూతన ఎస్‌డబ్ల్యూ డ్రైన్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ..ప్రధాన రహదారిపై నిత్యం మురుగునీరు పొంగిపొర్లుతుండటంతో ప్రయాణికులు, బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండటంతో సమస్యను జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. జీహెచ్‌ఎంసీ ద్వారా మంజూరైన రూ.43.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. డివిజన్ అభివృద్ధికి, మెరుగైన సౌకర్యాల రూపకల్పనకు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు కె.ఆనంద్ కుమార్, సాకెళ్లి సర్వేష్ కుమార్, డి.ప్రవీణ్, డి.శ్రీనివాస్, మహేశ్ సింగ్, ప్రదీప్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, వరుణ్‌రాజ్, జి.వికాస్, ఆర్.సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మాయిలు పట్టుదలతో చదవాలి


జయప్రకాష్ నారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: అమ్మాయిలు పట్టుదలతో చదవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. సోమవారం మెహిదీపట్నంలోని సెయింట్‌ఆన్స్ కళాశాలలో బ్యాలెన్సింగ్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ టూ సోర్ హై ఇన్ లైఫ్ అండ్ కెరీర్ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళాశాల విద్యార్థినులకు సందేశం ఇచ్చారు. నేడు యువత కేవలం సర్టిఫికెట్లు, డిగ్రీ పట్టాల కోసం విద్యను అభ్యసిస్తున్నామన్న ధోరణిని విడనాడాలన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అల్లం విజయరాణి, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ అనురాధా, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో పని చేయాలి


శ్యాంరావు ముదిరాజ్‌ను సత్కరిస్తున్న డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొనే శ్యాంరావు ముదిరాజ్ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ అన్నారు. గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు, సంఘ సేవకులు శ్యాంరావు ముదిరాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన సూచించారు.

హలీం బట్టీలు రెడీ


టోలిచౌకి రూమాన్ హోటల్ వద్ద..

గోల్కొండ: రంజాన్ అంటే హలీం మొట్టమొదటిగా గుర్తుకు వస్తుంది. హలీం అమ్మకాలకు మొదటి నుంచి మెహిదీపట్నం, మాసాబ్‌ట్యాంక్‌తో పాటు నానల్‌నగర్, సాలార్‌జంగ్ కాలనీ, ఫుట్‌కోర్టు, టోలిచౌకీ చౌరస్తా ఫేమస్. టోలిచౌకీ ప్రాంతంలో అత్యంత పురాతనమైన హోటళ్లు, రెస్టారెంట్లు బాగా ప్రజాదరణ పొందాయి. వీటిలో రహమత్ హోటల్, షాగౌజ్ హోటల్ తక్‌ధీర్ హోటల్‌లు హలీం తయారీకి పెట్టింది పేరు. రంజాన్ ఉపవాసాలు మొదలు అవుతున్నాయంటే హలీం ప్రియులకు ఎంతో రుచికరమైన హలీం గుర్తుకు వస్తుంది. పలు ప్రాంతాల్లో ఇప్పటికే హలీం తయారు చేసే బట్టీలు సిద్ధమయ్యాయి.

హలీం బట్టీ తయారీలో ఎన్నో ప్రత్యేకలు..

ఈ బట్టీ తయారీకి ఎర్రమట్టి (మోరం), కాల్చిన ఎర్ర ఇటుకలు వాడుతారు. ఎర్రమట్టి, ఇటుకలతో తయారు చేసిన బట్టీలలో వేడి ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా ఈ హలీంను కట్టెల మంటపైనే తయారు చేస్తారు. బట్టీలోనే హలీం తయారీకి వాడే పెద్ద పాత్రను ఉంచేస్తారు. ఈ పాత్ర చుట్టూ ఇటుకలతో మొత్తం కప్పేస్తారు. పొగ పోవడానికి ఓ వైపు పైపును అమరుస్తారు. మరోవైపు కట్టెలు పెట్టడానికి చిన్న కిటికీ లాంటిది ఏర్పాటు చేస్తారు. కట్టెలు మొత్తం కాలిన తర్వాత మండుతున్న బొగ్గలను బట్టీలోనే ఉంచి ఆ కిటికీలాంటి ప్రదేశాన్ని షాబాద్ రాయితో మూసేస్తారు. హలీంను కలపడానికి హలీం తయారీలో శిక్షణ పొందిన ఇద్దరు వ్యక్తులు ఉంటారు. వీరు భారీ కట్టెతో హలీంను బాగా పాత్రలోనే కలిగెటట్లు తిప్పుతారు. ఆ తర్వాత పాత్రమీద మూత వేసి దానికి గుడ్డతో కప్పేస్తారు. మొత్తం హలీం తయారీకి 8–9గంటల సమయం పడుతుంది.

'రంజాన్ నెల ఎంతో పవిత్రమైంది'


మాట్లాడుతున్న ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ

గోల్కొండ: రంజాన్ మాసంలో దేవుడు మానవాళికి దివ్య ఖురాన్‌ను ఇచ్చాడని ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. సోమవారం గోల్కొండలోని ఖర్వా మసీద్‌లో రంజాన్ నెలకు ఆహ్వానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రంజాన్ నెల ఎంతో పవిత్రమైందని.. ఈనెల రోజుల పాటు ముస్లింలు నిష్ఠతో ఉపవాస దీక్షలు ఉంటారన్నారు. అంతేకాకుండా ప్రతినిత్యం ఐదుపూటల నమాజ్ ఆచరిస్తూ దివ్య ఖురాన్ గ్రంథంలో రంజాన్ మాసంలోని నియమాలు, ఉపవాస దీక్షల ప్రాధాన్యం, రంజాన్ మాసంలో ఖురాన్ గ్రంథ పఠనం ఏ విధంగా చేయాలని అనే విషయాలు స్పష్టంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఖర్వా మసీదు అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ పఠాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ మజీదులకు చెందిన ఇమామ్‌లు, స్థానికులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో వైకుంఠధామం నిర్మించండి


డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్మల్‌కుమార్ యాదవ్, సతీష్‌కుమార్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యార్థం వైకుంఠధామాన్ని నూతనంగా నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జాతీయ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సతీష్‌కుమార్ పేర్కొన్నారు. అబిడ్స్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో 14వ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధునాతనమైన వైకుంఠధామాన్ని నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. మూసీనది ఒడ్డున నిర్మిస్తే ప్రజలకెంతో ప్రయోజనకరంగా ఉంటుందని వారన్నారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి


రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఇబ్రహీం ఖలీల్

గోల్కొండ: తెలంగాణలో ఉర్దూ భాషకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడామీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన ఆయనను గోల్కొండకు చెందిన ఇబ్రహీం బిన్ మోహసీన్ బాఖుల్కా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు మాతృభాష వచ్చేలా చూడాలన్నారు. ఉర్దూ భాష అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ఉర్దూ పండితులు, రచయితలతో కలిసి చర్చిస్తానన్నారు. ఉర్దూ మాధ్యమంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, ఉర్దూ టీచర్ల ఏర్పాటుకు విద్యాశాఖ వారికి సూచిస్తానని అన్నారు.

'ఉద్యోగుల పొట్ట కొట్టినందుకే కేసీఆర్ ప్రభుత్వం పతనం'


గోల్కొండ సతీష్

అబిడ్స్: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఉద్యోగుల పొట్టను కేసీఆర్ ప్రభుత్వం కొట్టినందుకే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పతనమైందని తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్ పేర్కొన్నారు. సోమవారం సతీష్ విలేకర్లతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీష్‌రావు తన విధానాలను మార్చుకోవాలన్నారు. మూడు నెలల్లోపే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 178 వీఆర్వోల కారుణ్య నియామకాల ఉత్తర్వులు జారీ చేయడంతో హరీష్‌రావు జీర్ణించుకోలేక ఉద్యోగులను కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. ఉద్యోగుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉండి వారి సంక్షేమానికి నడుంబిగించిందన్నారు. పదేళ్ల తర్వాత ఉద్యోగులకు, రైతులకు న్యాయం జరుగుతుంటే హరీష్‌రావు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఉద్యోగులంతా చూస్తూ ఊరుకోరని, తమ సత్తా చాటుతారని గోల్కొండ సతీష్ పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఉద్యోగులు ఏకమై మరోసారి కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

మహిళాభివృద్ధికి 'సింగరేణి' కృషి


వేడుకల్లో మహిళా ఉద్యోగులు

నాంపల్లి: మహిళాభివృద్ధికి సింగరేణి కృషి చేస్తుందని జనరల్ మేనేజరు మార్కెటింగ్ జి.దేవేందర్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం సింగరేణి భవన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవం వేడుకల్లో ఆయన ప్రసంగించారు. సింగరేణిలో మహిళల ఆర్థిక స్వావలంభన కోసం సింగరేణి సేవా సమితి ద్వారా గత 20 ఏళ్లగా అనేక వృత్తి శిక్షణలను ఉచితంగా అందించామని, దాదాపు 15 వేల మంది ఈ శిక్షణలు పొందారన్నారు. పోలీసు రిక్రూట్‌మెంట్‌లో కూడా మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన నేపథ్యంలో సింగరేణి ప్రాంతం నుంచి అనేక మంది పోలీసు ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సింగరేణి వ్యాప్తంగా 12 ఏరియాల్లో ఘనంగా నిర్వహిస్తున్నామని వివరించారు. అడిషనల్ జనరల్ మేనేజరు ఎస్.వి.రాజశేఖర్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎస్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులకు ఎంపీ టికెట్లు కేటాయించండి


భట్టి విక్రమార్కను కలిసిన మేరు సంఘం నాయకులు

అబిడ్స్: మేరు కులస్తులకు పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్లు కేటాయించాలని రాష్ట్ర మేరు యువజన సంఘం నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మేరు యువజన సంఘం నాయకులు పోల్కం వినయ్‌రాజ్, నర్సింహాస్వామి, ఆదిమూలం శంకర్, శివకుమార్, రఘురామ్‌తో పాటు పలువురు నాయకులు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందిస్తున్న పోల్కం శ్రీనివాస్‌కు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.